# కూటి కోసం ★

రచన: "భారతి"

విపరీతంగా వర్షిస్తోంది. అదరా బాదరాగా సెకెండ్‌క్లాసుకంపార్టుమెంటులోకి దూకాను పెట్టెలోనివాళ్ళు తమకేమీ పట్టనట్లుగా అద్దాల లోంచి చూస్తున్నారు బయటికి. నాకు తప్పని సరి ప్రయాణంగా మా శ్రీమతి ఆజ్ఞాపించడం వల్ల నేను వర్షాన్ని లెక్కచెయ్యకుండా బయ ల్దేరవలసివచ్చింది. మా బావకి టికెట్‌కలెక్ట రుగా వరంగల్ ట్రాన్స్‌ఫర్ అయింది. ఏమో దగ్గరగా వచ్చారుకదా అని ఒకమారు చూసి రమ్మంది మా శ్రీమతి. పోనీ వెళ్ళివద్దామని బయలుదేరాను ఓ మూడు రోజులుండే నిశ్చ యంతో........

కంపార్టుమెంటులో ఇద్దరు వ్యక్తులున్నారు. ఒక బెర్తుమీద మంచి బలమైన వ్యక్తి రైల్వే గైడు తిరగేస్తున్నాడు. నల్లటి లాంగ్‌కోటూ, కూలింగ్‌గ్లాసెస్, తలపై ధనవంతులైన మహమ్మదీయులు ధరించే టోపీ వేషం చూడగానే ఒక ధనవంతుడైన మహమ్మదీయు డని అనుకోక తప్పదు. వర్షంలో కూడా కూలింగ్ గ్లాసెస్ ధరించాడేమబ్బా అను కున్నాను. అతనికి ఎదురుబెర్తుమీద సుమారు 30 సంవత్సరాలామె కూర్చుంది. మనిషి నల్లగావున్నా సహజసౌందర్యం కుంటుపడినా కృత్రిమసౌందర్యంతో వెలిగిపోతోంది. తెల్లని జార్జెట్ చీర, నల్లని క్రేప్‌సిల్కుజాకెట్టు, ఎత్తు మడమలజోడు, ముఖానికి దట్టంగా అలుము కున్న పౌడరు, కలవారిలాగేవుంది. ఆమె ప్రక్కని కొన్ని తెలుగు ఇంగ్లీషు పత్రికలు వున్నయి. ఆమెను అతనిని పరిశీలించాను. ఆమెలో మహమ్మదీయ చిన్నెలుకాని, అత నిలో తెలుగువారి లక్షణాలుకాని అగుపించ లేదు. నేనుకూడ వారికెదురుగావున్న మరొక ప్రక్క కూలబడి రుమాలుతో ముఖంమీదపడ్డ వర్షపు చినుకుల్ని తుడుచుకుంటున్నాను.

"హూరుకోండి హమ్మా హమారా తక్దీర్ బాగా లేనప్పుడు హేంచేస్తాం? బడా అమీర్ అయినా పకీర్ అవుతాడు. అంతా ఖుదా యిష్టం" అన్నాడు భక్తిపూర్వకంగా పైకి చూస్తూ. నేను హఠాత్తుగా తలెత్తిచూచాను.

ఆమె పైటచెంగుతో కళ్లద్దుకుంటూ "చూడండీ! ఏ టికెట్‌కలెక్టరయినా చూస్తే ఏమి చెప్పాలో తెలియడంలేదు....ఈ సంగతి తెలిస్తే వారి కెంత అవమానం మందమతి దాన్ని. రుమాలుతోకూడా పారేసాను. జారి పోయిందంటే నమ్ముతారా ఎవరైనా...."

నాకేమీ అర్థంకాలేదు. ఏమిటండి సంగతి అన్నా కొంచెం బాతాఖానీ పెంచే ఉద్దేశంతో.

"చూడండిసాబ్....అమ్మగార్ని బాబుగారు జల్దీగా రమ్మని ఉత్తరంహేసినారు. స్టేషన్‌లో బాబుగారు రిసీవ్‌చేసుకుంటారు. అమ్మగారు బహద్దూర్‌సే వస్తువున్నార్. రుమాల్‌నికట్టిన టిక్కట్ హెక్కడో గిర్‌గయా. హందుకు గడబడ్‌పడ్తున్నావ్" అన్నాడా వ్యక్తి వచ్చీ రాని తెలుగులో.

"దానికేముంది టికెట్‌కలెక్టరుతో చెప్పండి ముందుగా చెప్పేస్తే రేటుమాత్రమే వసూలు చేస్తారు. లేకుంటే ఎక్సెస్ యిచ్చుకోవాలి" అన్నాను నేను మా డిపార్టుమెంటుమీద అభి మానంతో.

ఆమెచేతివేలికి పైటచెంగు ముడిపెడుతూ "దారి ఖర్చులకు మాత్రం పది రూపాయిలు పట్టుకున్నాను. అందులోదికూడ పత్రికలకు ఉదయం టిఫెనుకూ నాలుగు రూపాయిల దాకా ఖర్చుఅయిపోయింది. ఎలాగూ వారు స్టేషనుకి కారుతీసుకువస్తారుకదా అని ధీమాగా ఖర్చుచేసేసేను" అంది పశ్చాత్తాపపడుతూ. ఇంతలో స్టేషన్‌లో బండి ఆగింది. ఆ వర్త కుడు టోపీసర్దుకొని "అమ్మగార్ హెక్కడనుంచి మాదిదోస్త్ టిక్కట్‌కలెక్టరుగా వస్తాడ్ భోగట్టా అడిగివస్తా" అని దిగాడు. ఆమె బిత్తరపోతూ గుడ్లనీళ్ళు కుక్కుకుంటూ అతడు వెళ్లిన వైపోమారు నావైపోమారు చూస్తోంది.

ఆహా! మహమ్మదీయుడైన ఎంత పరోప కారబుద్ధి, ఎంతజాలి. హిందూస్త్రీని ఎలాగ గౌరవిస్తున్నాడో .... ఏదైనా సహాయం నావల్ల కూడ వాంఛిస్తున్నట్టుంది. పాపం మంచి వాళ్లకే యిబ్బందులు అని ఆలోచిస్తున్నా. ఈ ఆలోచనల్లో రైలుకదలడం, ఆ వర్తకుడు పరుగునవచ్చి రైలెక్కడం నేను గమనించనే లేదు.

"హమ్మగార్....మాది దోస్త్‌కి అడిగినాం. ముప్పది ఎనిమిది రుపయా కట్టవాలి అని సెప్పినాడ్. ఎక్సెస్ నహీఁ" అన్నాడు.

"ముప్పై ఎనిమిది రూపాయిలే ఎలా వస్తాయి" అంది భారంగా.

"అబ్బ! ముప్పై ఎనిమిదా" అన్నాను నేను నోరుతెరిచి. పది నిముషాలు నిశ్శబ్దం మామధ్య రాజ్యంచేసింది. ఆమె అడగలేక అడగలేక ఆ వర్తకుణ్ని "మీరే ఏమో దారి చూపండి" అంది. అతడు బెర్తుక్రిందనున్న పెట్టెతీసి చాటుగా కూర్చొని తాళంతీసాడు. పెట్టికూడ చాల అందంగా వుంది. ఐదు నిమి షాలు ఏమేమో సర్ది "అమ్మగార్ మాది పైసా ఫీ జాస్తీ లేదు. మాది వ్యాపార్‌కా పైసా సబ్ బ్యాంకిలోవుంచుతాం. తోడిపైసాతో ప్రయాణం చేస్తాం. చూడండి ఈ రోజుల్లో డాకూలోగ్ కూడా బడాఅమీర్‌సాబ్‌కిలాగా తిరిగి సామాన్ తీస్కొని దౌడ్‌తీస్తార్. ఒక్క దస్ రుపియా వుంది అది కావాలంటే తీస్కోండి" అన్నాడు, ఆమె సంశయిస్తున్నట్లుంది! మాట్లాడలేదు. "తీస్కోండి! ఏమీ ఫర్వాలేదు. మీరు బడా అమీర్‌సాబ్ కా ఔరత్. సమయం తప్పింది హేమి చేస్తాం. హమారా నసీబ్ వొయిసాహై" అన్నాడతడు మళ్ళీ. నేను అతని పరోపకార బుద్ధిని చూస్తూ జీర్ణించుకోలేకుండావున్నాను. నేనుకూడ ఏమైనా సాయంచేద్దామా అని ఆలోచించాను. ఆమె యేమీ బిచ్చకత్తెకాదు. బిచ్చకత్తెఅయితే ఆ ఖరీదయిన బట్టలు, ఆ చేతినంచి ఎలా వస్తాయి. పాపం .... సాయం చెయ్యాలంటే చెయ్యగలను. వాళ్ల మేనగోడ లికి వదినగారికి బహుమతులక్రింద ఏమైనా కొని యిమ్మని మా శ్రీమతి ఏభై రూపాయిలు స్వయంగా నా బాగ్‌లో పెట్టింది. అయినా ఆలోచిస్తున్నా యింకా ఏమవుతుందోనని.

ఆమె అతడిచ్చిన పది రూపాయిలనోటు అందుకుంటూ "మరి నావద్ద అయి దారు రూపాయిలకంటె ఎక్కువ లేవే! ఎలాగ" అంది దైన్యంగా శూన్యంలోకిచూస్తు. గొప్పింటి బిడ్డ అంతకంటె ఎలాఅడుగుతుంది చెప్పండి! వెంటనే నే నన్నాను. "ఒక పాతిక రూపా యిలవఱకు నే నిస్తాను మీ కభ్యంతరం లేక పోతే."

"వద్దండి" అంది సిగ్గుతో కుంచించుకు పోతూ, మొహమాటపడుతున్నట్టు స్పష్టంగా

తెలుస్తూనేవుంది. "పుచ్చుకోండి హమ్మా.... అంతా అల్లాకా హుకుం" అన్నాడు వర్తకుడు మళ్లీ ఆమె అంగీకారసూచకంగా తలూపింది. వెంటనే అయిదు అయిదు రూపాయల కాగి తాల్నితీసి ఆమె ప్రక్కని బెర్తుమీద పెట్టాను. పోనీ మన బంధువులకు తర్వాత పంపుకో వచ్చు. ఒక గొప్పింటిబిడ్డ ఆపదలో ఉన్న ప్పుడు ఆదుకోవడంకంటె నా డబ్బుకు పర మార్థం యింకేముంటుంది అని సమాధాన పర్చుకున్నాను. ఆమె మా యిద్దరివైపు కృత జ్ఞతా పూర్వకంగా చూస్తూ "దయచేసి మీ ఎడ్రస్ యివ్వండి. మావారితో చెప్పి మీకు



M. O. చేయించేస్తా. మీ మేలు ఎన్నటికి మరిచిపోను" అంది.

"ఊరుకోండి హమ్మా! మాకి మీరు వాపస్ యివ్వవద్దు. క్యా ఒక్కొక్కచోట వందల్ వేలు దండ్గచేస్తాం. ఒక మంచి మనిషికి యిచ్చింది తిరిగిపుచ్చుకుంటామా?" అన్నాడు హుందాగా.

ఆహాహా!....ఏమి ఉదారగుణం? నిజంగా అంత ఉదారస్వభావంకాబట్టే లక్ష్మీదేవి కూడ అతన్ని కరుణించింది. అతడు మహమ్మ దీయుడైయుండి అంతజాలిపడితే తోటిహిందు వుణ్ణి ఆమాత్రం సాయంచెయ్యడానికి వెను దీయడమా....! ఇచ్చిన డబ్బు మళ్ళీ కోర డమా! అంత అవమానం" అని అనుకొని నాకుకూడ మీరు పంపక్కరలేదు లెండి అన్నాను నేనుకూడతెచ్చిపెట్టుకున్న హుందాతో లోలోపలమాత్రం మా శ్రీమతికి ఏం సమా ధానం చెప్పుకోవాలా అని ఆలోచిస్తూ.

ఆమె మరొకమారు కృతజ్ఞత తెల్పి అత నితో "సాహెబ్‌గారూ ఇది తీసుకపోయి మీ స్నేహితుడిచేత టిక్కెట్ రాయించండి. మరొక టిక్కెట్‌కలెక్టరెవరైనా చూస్తే ఎక్సెస్‌కూడ వసూలుచేస్తాడు. ఇప్పటికైన తల వంపులే చాల్చాలు" అంది. స్టేషన్‌లో బండి ఆగింది. వర్తకుడు రైలుదిగివెళ్ళాడు. నేను కాస్త అలా లెట్రిన్‌లోకి వెళ్ళాను.

నేను దిగవలసిన స్టేషనులోకి వస్తుంది రైలు. సంచీ జాగర్తగా సర్దుకొని లేచాను. అతడుకూడ దిగులతాడు కాబోలు పెట్టె చేత్తో పట్టుకొని రెడీగా నిల్చున్నాడు ఆమె కూడ అదే స్టేషనులో దిగుతుందట. అందరం ఒకే స్టేషన్‌లో దిగుతాం అన్నమాట. కిటికీలోంచి తలపైకెత్తిచూచాను. ప్లాటుఫారం గ్రుడ్డిదీపాల వెలుతురులో మసకమసకగా వుంది. టైము చూస్తే $12\frac{1}{2}$ అయింది. అబ్బా మూడు గంటలు లేటుగా వచ్చామన్నమాట. రాత్రి తొమ్మిదింపావుకు రావలసిన రైలు........

రైలు ఆగింది. మేం ముగ్గురం ఒకరి నొకరు అభినందించుకొని ఎవరిదారినివారు విడిపోయాం. చిన్నచినుకులుపడుతున్నాయి. నాకుమాత్రం ఆమె జాలిముఖం కనిపిస్తునే వుంది మనస్సులో. తిన్నగా టిక్కట్‌కలెక్టర్ల గదికివెళ్ళాను. అక్కడ భోగట్టాచేసాను. మా బావ పన్నెండు గంటలకు డ్యూటీ అయిపోగా యింటికి వెళ్లిపోయారట. వాళ్లయిల్లు తెలు సునుగాని స్టేషనుకు చాలాదూరంలో వుంది. అందుచేత అర్ధరాత్రికి స్టేషనులోనే పడుకోడా నికి నిశ్చయించుకున్నాను. ముఖపరిచయం వున్న టికెట్‌కలక్టరొకడు బెంచీ ఖాళీచేసి యిచ్చాడు. పడుకున్నా కానీ రైళ్లరొదలు, ఇటూ అటూ అలికిడిగా తిరుగుతున్న మను షులువల్ల నిద్రపట్టలేదు. అలా దొర్లుతున్నా. రైలులోనిసంఘటన పదేపదే తలుచుకొంటూ.

* * *

తెల్లవారుఝామున మూడున్న రయింది. బయటకు పోవాలని టార్చిలైటు తీసుకొని బయలుదేరా. వచ్చేబళ్ళేవీ లేవు కాబట్టి దీపా లన్నీ తగ్గించబడివున్నాయి. అంతా నిద్రాదేవి ఒడిలో సుఖనిద్రచేస్తున్నారు. లెట్రిన్‌కి కొంచెం దూరంగా ఎవరో యిద్దరు వ్యక్తులుమాత్రం సామాన్లుసర్దుకుంటున్నారు మాట్లాడుకుంటూ. నేను లెట్రిన్‌లోకి వెళ్ళిపోయాను.

"నేనే అనుకుంటే నాకన్న బాగా నటిం చావే" అంది ఒక మగగొంతు.

"నీ తర్ఫీతు ఉత్తినే పోతుందా" అని ఆడగొంతు జవాబు.

ఎక్కడో విన్నగొంతువలే అని మరీ జాగ్ర తగా విన్నాను.

"భలే ఒక్కరాత్రిలో పాతిక రూపాయిలు పాపం చాలా జాలిమనిషిలా వున్నాడు"

"ఆఁ ఆ సమయంలో నీ ముఖం చూస్తే నల్లరాయికూడా కరిగిపోదూ?"

"చాల్లెద్దూ! నీవూ—నీవేళాకోళం—మళ్ళీ ఏ బండి ఎక్కుదాం?"

"ఎక్స్‌ప్రెస్."

"వేషమో?"

"అటునుంచి యిటు. నువ్వు మార్వాడీ గర్ల్. నేను శాస్త్రుల్లుగారూ!" కిలకిల గలగల నవ్వులు వినిపించాయి. నాకు ముచ్చెమటలు పోసాయి. అయినా అనుమానంతీరక పైకి వచ్చి టార్చివేసాను. ఆమెతొడపై అతడు తల పెట్టుకొని పడుకున్నాడు. చీర మడత ఒకటి పెట్టెమీద వుంది. కోటును మడతపెడుతోంది. ఆవి రాత్రి నాతో ప్రయాణంచేసిన వ్యక్తులు ధరించినవే — నాచేతిలో టార్చి జారి క్రింద పడింది. కూటికోసంఅన్నమాట అనుకోకుండా నానోటినుంచి వెలువడింది. ★